## క్లుప్తంగా

### కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో అమ్మవారు

డోన్: పట్టణంలోని పాత బస్టాండ్ వద్దనున్న కనక దుర్గమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. వేకువజామున నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

### రహదారి పనుల పరిశీలన


పాలుట్ల రంగస్వామి ఆలయ రహదారి పనులను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ డీఈ, ఏఈలు

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామం నుంచి పాలుట్ల రంగస్వామి ఆలయానికి 2.90 కిలో మీటర్ల మేర రూ. 3 కోట్లతో వేస్తున్న బీటీ రహదారి పనులను పంచాయతీ రాజ్ డీఈ గంగాధర్, ఏఈ మహేష్ శుక్రవారం పరిశీలించారు. నాణ్యతగా పనులు చేపట్టాలని కంట్రాక్టర్‌కు సూచించారు.

### కల్వర్టు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు

డోన్ టౌన్: పట్టణంలో శిథిలావస్థకు చేరుకున్న కల్వర్టుల స్థానంలో నూతన కల్వర్టులను ప్రాధాన్యతా క్రమంలో నిర్మిస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక వెంకటాచలం ఫంక్షన్ హాల్ వద్ద డ్రైనేజీపై శిథిలమైన కల్వర్టు స్థానంలో కొత్త కల్వర్టు పనులను వైస్ చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్, డీఈ రఘు, ఏఈ సురేష్, కాంట్రాక్టర్ గోవిందుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. చాలా ఏళ్ల క్రితం నిర్మించిన కల్వర్టులు శిథిలావస్థకు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వాటి స్థానంలో యుద్ధ ప్రాతిపదికన కొత్త కల్వర్టులు నిర్మించేందుకు నిధులు మంజూరు చేశామన్నారు.

### నివాళి

బనగానపల్లె: మండలంలోని పాతపాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శీలా చంద్రశేఖర్‌రెడ్డి తండ్రి శీలా శివరామిరెడ్డి(65) మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి శుక్రవారం గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ బెడదల చంద్రశేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి ఉన్నారు.

### ప్రాణం తీసిన ఈత సరదా

డోన్ టౌన్: ఈత కొట్టేందుకు మైనింగ్ గుంతలోకి దిగిన బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని కన్నపకుంట గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. మూడేళ్ల క్రితం మూతబడిన ఓ గనిలోని గుంతలో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరింది. శుక్రవారం సెలవు కావడంతో గ్రామానికి చెందిన చరణ్(14) సరదాగా ఈత కొట్టేందుకు అందులో దిగాడు. లోతు ఉండడంతో మునిగిపోయాడు. గమనించిన తోటి వారు గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో బయటకు తీసి డోన్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బాలుడి తండ్రి భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ మమత తెలిపారు.

### దానధర్మంతోనే ఆత్మసంతృప్తి

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకుని సంపాదనలో కొంత మొత్తాన్ని దానధర్మాలకు వినియోగించాలని ప్రకృతిపీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పరంధామ నిలయంలో పట్టణానికి చెందిన 150 మందికి రూ. 100 చొప్పున పింఛన్లను పంపిణీ చేశారు. ప్రకృతి పీఠం ఉపాధ్యక్షురాలు సుబ్బలక్ష్మమ్మ, రిటైర్డ్ హెచ్‌ఎం నారాయణస్వామి, మహేశ్వరరెడ్డి, రాములమ్మ పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో నలుగురు భక్తులకు గాయాలు

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు భక్తులు గాయపడ్డ సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎగువ అహోబిలం లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుని దిగువ అహోబిలం వచ్చేందుకు భక్తులు ఆటో ఎక్కారు. ఓం నమోనారాయణ మలుపు సమీపంలోకి వచ్చేసరికి ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అహోబిలం గ్రామానికి చెందిన వడ్ల రాజ్యలక్ష్మితో పాటో మరో ముగ్గురు గాయపడ్డారు. గాయపడ్డ వారిని ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తున్నారు.


బనగానపల్లె: ర్యాలీలో పాల్గొన్న మతపెద్దలు.


బేతంచెర్ల: రంగాపురంలో ముస్లింల ర్యాలీ


బేతంచెర్ల: ప్రార్థన గీతాలు ఆలపిస్తున్న ముస్లింలు

# భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

బనగానపల్లె రూరల్: మహ్మద్ ప్రవక్త జన్మదినోత్సవమైన మిలాద్–ఉన్–నబీ పండుగను శుక్రవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. దస్తగిరి స్వామి దర్గా పీఠాధిపతి సయ్యద్ అబ్దుల్ హుసేన్ సాహెబ్ (జండేవాలే సాహెబ్) ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పెట్రోల్ బంక్ సర్కిల్, ఆస్థానం రోడ్డు, పోలీస్ సర్కిల్, పాత బస్టాండ్ మీదుగా పొట్టి శ్రీరాములు విగ్రహం సర్కిల్ వద్ద ఉన్న మసీదు వరకు ర్యాలీ సాగింది. దారివెంట భక్తులకు స్వీట్స్, బిస్కెట్లు, నీటిప్యాకెట్లు పంపిణీ చేశారు. ప్రవక్త బోధించిన శాంతి, సహనం, సేవా సందేశాలను మతపెద్దలు గుర్తుచేశారు. ఈ సందర్భంగా సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐ కల్పన ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


బనగానపల్లెలో ముస్లింల ర్యాలీ

- కొలిమిగుండ్ల: మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజును పురస్కరించుకుని కొలిమిగుండ్ల, అవుకు మండలాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రవక్త బోధించిన శాంతి, కరుణ, న్యాయం విలువలు నేటికీ సమాజానికి మార్గదర్శకమని మత పెద్దలు పేర్కొన్నారు. పలు గ్రామాల్లో ఇళ్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.
- డోన్ టౌన్: పట్టణంలోని ముస్లింలు మిలాద్ ఉన్ నబీ సందర్భంగా మధ్యాహ్నం జుమ్మా నమాజ్ చేశారు. పాత బస్టాండ్‌లోని సమైక్యాంధ్ర కట్ట వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.
- బేతంచెర్ల: మండలంలోని సిమెంట్‌నగర్, గూటుపల్లె, ఆర్‌ఎస్ రంగాపురం, పెండేకల్లు, కొలుములపల్లె గ్రామాల్లోని దర్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఆసర్‌పేట కాలనీలో మండల ఖాజీ నూర్ అహ్మద్ నమాజ్ నిర్వహించారు. సౌదీ అరేబియాలోని మదీనా నుంచి తెచ్చిన మహ్మద్ ప్రవక్త వెంట్రుకను భక్తులకు దర్శనార్థం ఉంచారు. గూటుపల్లె పెద్ద రాజు స్వామి దర్గా ఆవరణంలో దర్గా పీఠాధిపతి గురుసయ్యద్ అక్బర్ బాషా ఖాద్రి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు, అన్నదానం నిర్వహించారు. ఆర్‌ఎస్ రంగాపురంలో ముస్లింలు ర్యాలీ చేపట్టారు.


డోన్ పాత బస్టాండ్‌లో అన్నదానం చేస్తున్న ముస్లింలు

**ప్రవక్త మార్గం అనుసరణీయం**

ప్యాపిలి: ముస్లింలు మహమ్మద్ ప్రవక్త చూపిన బాటలో నడవాలని హాఫీజ్ మహబూబ్ ఖాన్ అన్నారు. స్థానిక జామియా మసీదు నుంచి పట్టణ ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ నిర్వహించారు. తోటివారిపై ప్రేమ, దయ తదితర సద్గుణాలు కలిగి ఉండాలని మహమ్మద్ ప్రవక్త తన జీవన విధానం ద్వారా చాటి చెప్పారని తెలిపారు. ప్రవక్త చూపిన బాటలో నడిచిన వారిపై అల్లా కరుణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ముస్లింలు మహబూబ్ సాహెబ్, మస్తాన్ ఖాన్, మహబూబ్ బాషా, మత్తు బాబా సాహెబ్, రహంతుల్లాబాషా, రషీద్, జహంగీర్ పాల్గొన్నారు.


ప్యాపిలిలో ముస్లింల ర్యాలీ


కోవెలకుంట్ల: రోటరీక్లబ్‌లో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంఈఓ

# గురువులు భావితరాలకు మార్గదర్శకులు

- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- ఉత్తమ టీచర్లకు సన్మానం

కోవెలకుంట్ల: బనగానపల్లె నియోజకవర్గంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కోవెలకుంట్ల రోటరీక్లబ్ భవనంలో ఆ క్లబ్ అధ్యక్షుడు వెంకటరాముడు ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు శ్రీనివాసులు, సుజాత, మనోహర్, ప్రసాద్, జీవీ సుబ్బారెడ్డి, కవితను ఎంఈఓ వెంకటసుబ్బయ్య సత్కరించారు. అలాగే పరంధామ నిలయంలో రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి ఆధ్వర్యంలో రాధాకృష్ణన్ జయంతిని జరిపారు. రోటరీక్లబ్ సెక్రటరీ పీవీ సుబ్బారావు, గౌరవాధ్యక్షుడు ఎస్‌ఎం షరీఫ్, క్లబ్ మాజీ అధ్యక్షుడు బాలాంజనేయరెడ్డి, మోహనమూర్తి, అబ్దుల్ సత్తార్, సభ్యులు వెంకటేశ్వరరెడ్డి, చంద్రశేఖర్, నాగేశ్వరరెడ్డి, దస్తగిరి, విజయలక్ష్మి పాల్గొన్నారు.


డోన్: ఉపాధ్యాయులను సత్కరిస్తున్న డాక్టర్ వలి


బేతంచెర్ల: అమ్మవారిశాలలో..

**ఉపాధ్యాయులకు సత్కారం**

డోన్/డోన్ టౌన్: గురువులు భావితరాలకు మార్గదర్శకులని ప్రజావైద్యశాల నిర్వాహకుడు మల్లికార్జున, వైద్యుడు వలి అన్నారు. స్థానిక ప్రజావైద్యశాలలో కటారుకొండ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం రామక్రిష్ణ, డోన్‌కు చెందిన ప్రైవేట్ టీచర్లు హిట్లర్ బాబులను సత్కరించారు. గురుపూజోత్సవ ప్రాధాన్యత, ప్రాముఖ్యత గురించి, దేశ స్వాతంత్ర్యం కోసం సర్వేపల్లి రాధాక్రిష్ణన్ చేసిన సేవల గురించి వక్తలు వివరించారు. అలాగే వైఎస్ నగర్‌లోని హోసన్నా వృద్ధాశ్రమంలో సర్వేపల్లి జయంతిని నిర్వహించారు.

- సంజామల: ఆల్వకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేసిన పుష్పలతను పూర్వ విద్యార్థులు సఫియా, లావణ్య సత్కరించారు. కేక్ కట్‌చేయించి చిరు కానుకను అందజేశారు.
- బేతంచెర్ల: విద్యార్థుల జీవితాల్లో చీకట్లు తొలగించి వెలుగులు నింపేవారు గురువులని వాసవీ క్లబ్, వనితా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సుధీర్, రమణ, ఇందుమతి, శ్రీవిద్య అన్నారు. పట్టణంలోని అమ్మవారిశాలలో రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయులు లక్ష్మీ నారాయణ, ఆదినారాయణ, వెంకటరావు, కృష్ణ మూర్తిలను సత్కరించారు. ఆర్యవైశ్య సంఘం నేతలు జనార్దన్, గుండా గోపాలు, శేఖరయ్య, సుబ్రమణ్యం, రామూర్తి, విష్ణు, సురేంద్ర పాల్గొన్నారు.


సంజామల: హెచ్‌ఎం నాగరాజును సన్మానిస్తున్న ఎస్టీయూ నేతలు

- సంజామల: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన ముక్కమల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాగరాజును జిల్లా ఎస్టీయూ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. నంద్యాల ఉప విద్యాధికారి శంకర ప్రసాద్, సంఘం అధ్యక్షుడు మౌలాలి పాల్గొన్నారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం

బేతంచెర్ల టౌన్: ప్రమాద సమయంలో చేసే రక్తదానం ప్రాణదానంతో సమానమని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు, బేతంచెర్ల సీఐ వెంకటేశ్వర్లు, బనగానపల్లె సీఐ మంజునాథ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో మత సామరస్య చైతన్య వేదిక ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. యువత, స్వచ్ఛంద సంస్థల సభ్యులు సమాజ సేవలో ముందుండి రక్తదానం చేయడం అభినందనీయమని అధికారులు పేర్కొన్నారు. ఈ శిబిరంలో పోలీసులు, పారిశ్రామికవేత్తలు, యువకులు సహా 114 మంది రక్తదానం చేశారు. పారిశ్రామికవేత్తలు మారుతి కృష్ణ, గౌరి హుసేన్ రెడ్డి, ముర్తుజావలి, బాబుల్ రెడ్డి, సత్తార్, మత సామరస్య చైతన్య వేదిక సభ్యులు అబ్దుల్ ఖాదర్, శాలీబేగ్, రషీద్, దస్తగిరి, రవి, రామకృష్ణ పాల్గొన్నారు.


రక్తదాతలకు జ్ఞాపికలు అందజేస్తున్న డీఎస్పీ

# కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం ప్రారంభం

డోన్ టౌన్: జగదుర్తి గ్రామ సమీపంలోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ అవయవాలు, సహాయక పరికరాలు తయారు చేసే కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, సంస్థ ఫౌండర్ డైరెక్టర్ తిప్పన్న, స్విజ్జర్లాండ్ ప్రతినిధి డాక్టర్ క్రిస్టోఫ్‌తో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. దివ్యాంగులు స్వతంత్రంగా నడవడానికి, వ్యక్తిగత పనులు చేసుకోవడానికి పరికరాలు ఎంతో అవసరమని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా నంద్యాల, కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల ప్రజలు ప్రయోజనం పొందుతారని పేర్కొన్నారు. ఇక దివ్యాంగుల పునరావాసంలో భాగంగా వివిధ థెరపీ కార్యక్రమాలు, ఆపరేషన్లు, సంఘాలు–సమాఖ్యల ఏర్పాటు కూడా సంస్థ చేపడుతుందని వివరించారు. కార్యక్రమంలో గ్రామీణ బ్యాంక్ క్యాషియర్ మంగమ్మ, సభ్యులు చంద్రశేఖర్, కోఆర్డినేటర్ శివశంకర్, ఆర్థో టెక్నీషియన్ ఆదిశేషయ్య, ఫిజియోథెరపిస్టు వీరాంజనేయులు, రవినాయక్, మండల కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తిప్పన్న

### త్వరలో ఎంపీడీఓ పోస్టుల భర్తీ

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్ల, అవుకు మండలాల్లో ఖాళీగా ఉన్న ఎంపీడీఓ పోస్టులు త్వరలో భర్తీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల డిప్యూటీ ఎంపీడీఓలకు ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పించిన విషయం తెలిసిందే. కొలిమిగుండ్లలో రెండేళ్లుగా ఎంపీడీఓ లేకపోవడంతో ఏఓ ప్రసాదరెడ్డికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అవుకులో ఎంపీడీఓగా విధులు నిర్వహించిన వెంకటేశ్వరరెడ్డి నాలుగు నెలల క్రితం పదవీ విరమణ చెందారు. అప్పటి నుంచి ఖాళీ ఏర్పడింది. డిప్యూటీ ఎంపీడీఓలకు పదోన్నతులు కల్పించడంతో రెండు మండలాలకు రెండు,మూడు రోజుల్లో ఉన్నతాధికారులు ఎంపీడీఓలను నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### అవసరం మేరకే యూరియా వాడాలి

కొలిమిగుండ్ల: రైతులు అవసరం మేరకే యూరియాను వాడాలని ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి నాగేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం నుంచి పెట్నికోట, నందిపాడు, బిఉప్పలూరు, తోళ్లమడుగు గ్రామాల్లో యూరియా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. వారంలో పెద్దవెంతుర్ల, చింతలాయిపల్లె, కొలిమిగుండ్ల రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేస్తామన్నారు. ఈక్రాప్ ఆధారంగా పంట వేసిన రైతులకు మాత్రమే యూరియా పంపిణీ జరుగుతుందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

### ఏడుగురిపై కేసు నమోదు

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లకు చెందిన బోయ రవికుమార్‌పై దాడి చేసిన కేసులో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్ బాబు శుక్రవారం తెలిపారు. ఇటీవల జరిగిన వినాయక నిమజ్జనం సమయంలో జడలమ్మగారి వెంకటేష్‌తో బోయరవికుమార్ అతని స్నేహితుడు అందె శ్రీనివాస్‌కుమార్ చిన్న పాటి ఘర్షణ పడ్డారు. ఈనెల 2వ తేదీ రాత్రి రవికుమార్ ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న బట్టల దుకాణానికి తాళాలు వేసి ఇంటికి వెళుతున్న సమయంలో వెంకటేష్ పాత కక్షలు మనసులో పెట్టుకుని కొంత మందితో కలిసి దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డోన్ టౌన్: డోన్–బేతంచెర్ల హైవే పనుల కారణంగా శనివారం యు.కొత్తపల్లె సబ్‌స్టేషన్ పరిధిలోని మార్కెట్‌యార్డు, జూనియర్ కళాశాల, రైల్వే స్టేషన్, సీపీఐ ఆఫీసు, త్రివర్ణ కాలనీలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

# స్కూల్ గేమ్ సెక్రటరీ ఎంపికలో అవకతవకలు

డోన్ టౌన్: నంద్యాల జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఎంపికలో అవకతవకలు జరిగాయని పాతపేట జెడ్పీ హైస్కూల్ పీఈటీ సుధాకర్ ఆరోపించారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. అమరావతి నుంచి వచ్చిన కమిషనర్ నోటిఫికేషన్ ప్రకారం అర్హత ఉన్న అభ్యర్థులను పక్కనబెట్టి, తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసిన వారిని ఎంపిక చేశారని ఆరోపించారు. రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలలో అసలు పాల్గొనకుండానే నకిలీ సర్టిఫికెట్లు సమర్పించారని, అలాగే రాష్ట్ర స్థాయి పోటీలను ఆర్గనైజ్ చేసినట్లు తప్పుడు క్లెయిమ్ చేసి అదనపు పాయింట్లు పొందారని తెలిపారు. ఒక క్రీడాకారునికి అత్యుత్తమ సర్టిఫికేట్‌కే మార్కులు ఇవ్వాలని, కానీ ఒకరికి రెండు–మూడు విభాగాల్లో మార్కులు ఇవ్వడం తగదని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి, స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ విచారణ చేయించి, నకిలీ సర్టిఫికెట్లు సమర్పించిన వ్యక్తిని తొలగించాలని, లేకపోతే చట్టపరంగా పోరాడతామని తెలిపారు.


ఆరోపణ చేస్తున్న సుధాకర్

# కోవెలకుంట్లకు 30 వేల బస్తాల యూరియా

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఆరు మండలాలకు 30 వేల బస్తాల యూరియా సరఫరా అయినట్లు ఏడీఏ సుధాకర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కోవెలకుంట్ల మండలానికి 4,309 బస్తాలు, దొర్నిపాడుకు 1,976, ఉయ్యాలవాడకు 2,693, సంజామలకు 6,463, కొలిమిగుండ్లకు 3,770, అవుకు మండలానికి 10,773 బస్తాల యూరియాను కేటాయించగా ఆయా రైతు సేవా కేంద్రాలకు చేరిందన్నారు. రైతులు మండల వ్యవసాయ అధికారుల నుంచి పంట ధృవీకరణ పత్రం రాయించుకుని రైతు సేవా కేంద్రాల్లో యూరియా తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే మొక్కజొన్న రైతులకు యూరియా సరఫరా చేశామని, వరి సాగు చేసే ప్రతి రైతుకు యూరియా అందజేస్తామని పేర్కొన్నారు.

# విద్యుత్ తీగల చోరీపై ఫిర్యాదు

సంజామల: గిద్దలూరు గ్రామ సమీపంలోని జగన్నాథగట్టు వద్దనున్న పవర్ గ్రిడ్ కంపెనీకి చెందిన విద్యుత్ కేబుల్‌ను ఈ నెల 3వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. సుమారు రూ.3.5 లక్షల విలువ చేసే 850 కేజీల విద్యుత్ కేబుల్ అపహరణకు గురైందని పవర్ గ్రిడ్ అనుసంధాన సిప్పర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సీనియర్ మేనేజర్ సతీష్ కుమార్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు.

# రేబిస్ గుబులు

బనగానపల్లె: పట్టణంలో వీధికుక్కలకు రేబిస్ టీకాలు వేయడంలో జరుగుతున్న జాప్యం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. గతంలో వీధికుక్కలు కరిచిన సంఘటనలు చోటుచేసుకోవడంతో, మళ్లీ అలాంటి ఘటనలు పునరావృతమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పశుసంవర్ధకశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి, ఆగస్టు నెల 22వ తేదీ నుంచి పట్టణంలోని వీధికుక్కలకు టీకాలు వేయాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే ఇప్పటివరకు టీకాలు వేసే కార్యక్రమం ప్రారంభం కాకపోవడంతో పట్టణ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయంపై గ్రామపంచాయతీ ఈఓ సతీష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కుక్కలను పట్టుకునే సిబ్బంది ఇతర ప్రాంతాల నుంచి రావాల్సి ఉందని, వారు రాగానే టీకాలు వేయించే చర్యలు చేపడతామని తెలిపారు.


బనగానపల్లెలోని ఓ వీధిలో సంచరిస్తున్న వీధికుక్కలు




# నీటి వృథా.. రైతుల వ్యథ


డోన్ టౌన్: మండలంలోని వెంకటాపురం తుమ్మల చెరువు (అబ్బిరెడ్డిపల్లె)లో నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువుకు ఉన్న రెండు ప్రధాన తూముల్లో పల్లె తూము గేటు విరిగిపోవడంతో నెల రోజులుగా నీరు వృథాగా కాలువలకు చేరుతోంది. దీనిపై పలుమార్లు రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. గత నెలలో చెరువును పరిశీలించిన స్థానిక ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డికి కూడా సమస్యను వివరించినా ప్రయోజనం లేకపోయిందని రైతులు మండిపడుతున్నారు. నీటి వృథాను నివారించేందుకు అవసరమైన ఇనుప ప్లేటు తీసుకొచ్చి తూముపై ఉంచినా, దానిని అమర్చకపోవడంతో సమస్య కొనసాగుతోందని రైతులు తెలిపారు. దీని కారణంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 3 వేల ఎకరాల మాగాణి బీడుగా మారిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.


తూముపై ఉంచడానికి తెచ్చిన ప్లేటు

# పనిచేయని మినరల్ వాటర్ ప్లాంట్

- తప్పని తాగునీటి ఇక్కట్లు

కోవెలకుంట్ల: మండలంలోని అమడాలలో ఏర్పాటు చేసిన మినరల్‌వాటర్‌ప్లాంట్ పది రోజుల నుంచి పనిచేయడం లేదు. నీటిని ఫిల్టర్ చేసే మిషనరీ దెబ్బతినడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. ప్లాంట్ మూతపడడంతో గ్రామ ప్రజలకు తాగునీటి ఇక్కట్లు తప్పడం లేదు. అలాగే గ్రామ మెట్ట వద్ద ఉన్న మినరల్‌వాటర్‌ప్లాంట్ మిషనరీ సైతం దెబ్బతినడంతో నీరు ఫిల్టర్ కాకుండా రా వాటర్ వస్తోంది. దీంతో మంచినీటి సమస్య తలెత్తింది. ప్లాంట్ పక్కనే ఉన్న జడలయ్యస్వామి ఆశ్రమం వద్ద నిత్యాన్నదానం కొనసాగుతోంది. కోవెలకుంట్ల–బనగానపల్లె ఆర్‌అండ్‌బీ రహదారిలో ప్రతి రోజు వందల సంఖ్యలో లారీలు, కార్లు, ఆటోలు, తదితర వాహనాల్లో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. వీరంతా ఆశ్రమం వద్ద ఆగి భోజనం చేస్తున్నారు. ప్లాంట్ ద్వారా మంచినీరు సరఫరా కాకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. వీరితోపాటు అమడాల, సౌదరదిన్నె గ్రామాల ప్రజలు, పొలాలకు వెళ్లే రైతులు, కూలీలు ప్లాంట్ ద్వారా తాగునీటిని పట్టుకుని పొలాలకు వెళ్లి దాహార్తి తీర్చుకుంటున్నారు. రెండ్లు ప్లాంట్లు పనిచేయని విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని యుద్ధప్రాతిపదికన వాటికి మరమ్మతులు చేపట్టి స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.


మూతపడ్డ మినరల్ వాటర్‌ప్లాంట్


పనిచేయని మిషనరీ

**రేపు చౌడేశ్వరిదేవి ఆలయం మూసివేత**

బనగానపల్లె రూరల్: ఈ నెల 7వ తేదీ సంపూర్ణ సూర్యగ్రహణం కారణంగా నందవరం చౌడేశ్వరిదేవి ఆలయాన్ని మూసివేస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 8వ తేదీ ఉదయం 7 గంటల వరకు మూసి ఉంచుతామని చెప్పారు. ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం, నిత్యపూజ అనంతరం భక్తులకు దర్శనం యథావిధిగా ఉంటుందని తెలిపారు.